# సత్యవాక్కు

THE
WORD OF
TRUTH

క్రైస్తవ మాసపత్రిక

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-30 ని॥లకు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| సోమవారము | 9-00 to 9-15 p.m. |
| బుధవారము | 9-30 to 9-45 a.m. |

**హిందీ — SATYA SUSAMACHAR**

| | |
|---|---|
| మంగళవారము, గురువారము, శుక్రవారము | 9-00 to 9-15 p.m. |
| ఆదివారము | 1-30 to 1-45 p.m. |

**తమిళం — SATYA VAZHI**

| | |
|---|---|
| మంగళవారము | 5-30 to 5-45 p.m. |
| గురువారము, శుక్రవారము | 6-45 to 7-00 p.m. |

**మళయాళం — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| మంగళవారము, శుక్రవారము | 3-45 to 4-00 p.m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు క
స్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను ఉచితంగ
పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
**J. C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంచిక **3** — అక్టోబరు **1986** — సంపుటి **7**


## సంపాదకీయము

### నమ్మకత్వము యొక్క భావము

*(The Meaning of faithfulness)*

క్రైస్తవ జీవనాన్ని గూర్చి విచారించునప్పుడు అతి ప్రాముఖ్యమైనది నమ్మకత్వము. నమ్మకత్వమంటే యేమిటి? దానిలో యేమి ఇమిడి యున్నది దాన్ని మనం గ్రహించుకొన్నామా? అనుసరించుచున్నామా?

నమ్మకముగా యుండుట అంటే యేమిటో వర్ణించాలంటే మన భౌతిక జీవనం యొక్క వివిధ పరిస్థితుల నొక్కమారు పరిశీలించాలి. ఒకడు నమ్మకమైన పనివాడని మనం చెప్పునప్పుడు అతడు క్రమంగా స్తాడని, అతనిపై మనం ఆధారపడవచ్చునని, లెక్కలో వేసుకో వచ్చునని మన భావం. అతడు అపనమ్మకస్థుడైతే అతడు పైన చెప్పిన వానికి వ్యతిరేకంగా యుంటాడు. అతనిని వాడుకొనేవారెవరు ఉండరు.

నమ్మకమైన భర్త యని భార్య యని మనం చెప్పుకొంటాము. అంటే వారొకరినొకరు మోసగించుట లేదని, ఒండొరులకు నమ్మక

ముగా యున్నారని మన భావం. అప్పు తీర్చుటలో నమ్మకస్థులని లే చదువులో నమ్మకముగా యున్నారని మనం కొందరిని గూర్చి చెప్పుకొంటాము గదా.

క్రీడల సంగతి యేమిటి? ఒకడు పందెములో ప్రవేశించుట యే కాదుగాని, బహుమానం పొందాలంటే ఒకడు తన పందెమును ముగించాలి. అట్లే వందలకొలది అట్టి సంగతులను గూర్చి మనం చెప్పగ వచ్చును.

పైన చెప్పబడిన సంగతులన్నిటిని మనం గ్రహించుకొంటాము. అయితే ఆత్మీయ సంగతుల విషయం యేమిటి? క్రైస్తవుడని చెప్పుకొంటే సరిపోదు. ఒకడు క్రైస్తవుడవుట మాత్రమే గాక పరలోకానికి వెళ్ళుటకు క్రైస్తవునిగానే చివరివరకు ఉండాలి. ఇక్కడ నమ్మకత్వము దృశ్యములోనికి వస్తాది.

మొదటిగా దేవుడెల్లప్పుడు నమ్మకముగా యున్నాడు. అపొ. పౌలు ఇట్లు చెప్పాడు: "మనము నమ్మదగని వారమైనను ఆయన నమ్మదగినవాడుగా ఉండును; ఆయన తన స్వభావమునకు విరోధముగ ఏమియు చేయలేడు" (2 తిమో 2:13). మనమేమి చేసినను, లే చేయకపోయినను దేవుడెల్లపుడు దేవునిగానే యుంటాడు, ఆయన ఎప్పుడు మారడు. ఆయనలో మనకున్న ఈ నమ్మకాన్ని బట్టి ఆయన యందు మనము విశ్వాసముంచి ఆయనకు లోబడుట సులభము.

దేవుడెన్నడు విఫలుడు కాలేదు, తన మాటనెన్నడు దిగజా లేదు. హెబ్రీ పత్రిక లేఖకు డిట్లన్నాడు: "వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మనమొప్పుకొనిన దానిని నిశ్చయముగా పట్టుకొందము" (హెబ్రీ 10 : 23). దేవుడు నమ్మకమైన సృష్టికర్తయని పేతురు చెప్పాడు (1 పేతురు 4:19).

రెండవదిగా క్రీస్తు నమ్మదగినవాడు. మనం రక్షింపబడు నిమిత్తము ఆయన పరలోకమునుండి భూమి మీదకు వచ్చి ఘోరమైన సిలువ మరణాన్ని పొందాడు. ఆయన మనల్ని ప్రేమించుచున్నాడు, మనల్ని రక్షింపగోరుచున్నాడు. ఆయన తన వాగ్దానమును గూర్చి నిర్లక్ష్యము చేయువాడుకాడు (2 పేతురు 3:9). ఈయుగ సమాప్తి వరకు సదాకాలము మనతోయుంటానని ఆయన చెప్పాడు (మత్త 28 : 20). శోధన సమయములో కూడ జయించుటకు ఆయన మనకు సహాయం చేస్తాడు. "ఆకాశ మండలముగుండ వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మనప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడుగాని సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయునని" యోహాను చెప్పుచున్నాడు (1 యోహా 1:9). గనుక అన్ని విధాలుగా ఆయన నమ్మదగినవాడు. ఆయనను వర్ణించే మార్గము ఇంకొకటిలేదు.

మూడవదిగా, దేవుడు తనప్రజలనుండి నమ్మకత్వాన్ని కోరుచున్నాడు. ఇది యుక్తమైన సేవ (రోమా 12:1, 2).

నమ్మదగినవాడనగా అతనిపై మనం ఆధారపడగలమని యర్థము. నమ్మదగినవాడు, చెప్పుకోదగినవాడు. అతన్ని ఎప్పుడు లెక్కలో వేసుకోవచ్చు. "కాగా నా ప్రియసహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి స్థిరులును, కదలనివారును,

ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆశక్తులునై యుండుడి" (1 కొరింథీ 15 : 58).

నమ్మదగినవాడనగా లోబడువాడని యర్థము. అతడు ప్రభువు యొక్క అధికారాన్ని గుర్తిస్తాడు. అతడు చెప్పుదానిలోను, చేయు దానిలోను అన్నిటిలోను క్రీస్తును ప్రథమంగా ఉంచుతాడు (మత్త 6 : 33). అతడు వాక్యమునుబట్టి చేయువాడు (యాకో 1:22).

నమ్మకముగా యుండుట అనగా ఒకడు నమ్ముచు, లోబడుచు, సేవచేయుచు యుంటాడని అర్థము. "మరణమువరకు నమ్మకముగా ఉండుము; నేను నీకు జీవ కిరీట మిచ్చెదను" అని ప్రభువు చెప్పు చున్నాడు (ప్రక 2 : 10).

నమ్మకముగా యుండుటవలన ఒకడు పంటకోయును, విజేయు డగును, నిత్య జీవ కిరీటాన్ని పొందును. "శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును" అని యాకోబు చెప్పుచున్నాడు (యాకో 1 : 12).

అయితే యిది ఆరంభము మాత్రమే. నమ్మకముగా యుండు టలో ఇదంతయు, ఇంకా ఎంతో ఇమిడియున్నది. అది సేవచేస్తూ, యిస్తూ, పెరుగుతూ, బలవంతులగుచు యుండు జీవితం. అది పనిని, పరిచర్యను, నమ్మకత్వాన్ని, ప్రతిష్టించుకొనుటను సూచించుచున్నది. ఒకడు క్రీస్తులోను, క్రీస్తులో అతడును ఉన్న జీవితం అది; క్రీస్తు యొక్క ఆత్మను, క్రీస్తువలెను ఉన్న జీవితం అది.

నీవు క్రీస్తుకు లోబడ్డావా ? అట్లయితే ఆయనను నమ్మకముగా వెంబడించుచున్నావా ? ఆయన నీపై ఆధారపడగలడా ? జీవిత కాల మంతయు నీ వాయనతోనే యుంటావా ? అట్లయితే పరలోక గృహో

ంకి చేరుకొనే నమ్మకస్థులలో నీ వొకడవై యుందువు. నీ ప్రభువుతో నిత్యము జీవించువాడవగుదువు. అది నీ నమ్మకత్వానికి దొరికిన బహుమానమగును. దానికై మన మిచ్చు మూల్యము స్వల్పమే. ఆయన కృపా కనికరముల కొరకు ప్రభువుకే సమస్త మహిమ కలుగునుగాక!!

---

## నీవు ముఖ్యుడవు

### (*You are Important*)

ఈ వ్యాసము యొక్క పేరులో నేను దీనిని చదివే ప్రతి క్రీస్తు సంఘ సభ్యునిగూర్చి చెప్పియున్నాను. ఈ మధ్య ఒక మేగజైన్‌లో నేనిలా చదివాను: "ఆఫ్రికాలో సంఘము మిగతా వారితో చూస్తే బాల్యదశలో యున్నను, క్రైస్తవ్యము యొక్క భవిష్యత్తు ఇక్కడే యుందని అనేకమంది పరిశీలకులు భావించుచున్నారు". మనము "ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని" పరిశుద్ధాత్ముడు చెప్పియున్నాడు (హెబ్రీ 10:25). ఇది భారతదేశాన్ని గూర్చి ఎందుకు చెప్పబడకూడదు? ఆఫ్రికాలో ంటె ఇండియాలో జనసంఖ్య ఎక్కువ. ఆఫ్రికాలో వలెనే ఇండియాలో కూడ సువార్తకు విధేయులయ్యేవారు లక్షల కొలది యున్నారు. ఫ్రికాలో జరిగిన దానికంటె ఎక్కువ విజయాన్ని సాధించుటకు మనకు డ్డు వచ్చేది యేమిటి? అది మన విశ్వాస లేమియే. లోకమును యించు విజయము మన విశ్వాసమే (1 యోహాను 5:4). మనలను ప్రేమించు ఆయనద్వారా మనము అత్యధిక విజయమును పొందలము (రోమా 8:37).

ప్రపంచ సువార్త వ్యాప్తి కొరకు అవసరమైనది ఒకే ఒక్కటి న్నది: అది ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే (గలతీ 5:6).

## క్రీస్తులో ఏ భేదము లేదు

క్రీస్తునందు కులము, రంగు, భాష భేదములు లేవు. దేవుని వాక్యములో ఇట్లున్నది: "ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించిన వాని పోలిక చొప్పున నూతనపరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొని యున్నారు. ఇట్టివారిలో గ్రీసు దేశస్థుడని యూదుడని భేదము లేదు; సున్నతి పొందుట యని సున్నతి పొందకపోవుట యని భేదము లేదు; పరదేశి యని సిథియనుడని దాసుడని స్వతంత్రుడని లేదుగాని, క్రీస్తే సర్వమును అందరిలో ఉన్నవాడునై యున్నాడు" (కొలస్స 3:10, 11). నీవు ప్రాముఖ్యుడవు! క్రీస్తు యేసులో నీవు నూతన పురుషుడవగునట్లు ప్రాచీన స్వభావము నంతటిని పెరికి పార వేయాలి. క్రీస్తు యేసు నందలి విశ్వాసముద్వారా మనము దేవుని కుమారులము. క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన వారందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతీ 3:26, 27). విశ్వాసి దేవుని కుమారుడగు అధికారమును కలిగి యున్నాడు (యోహాను 1:12).

## తగ్గించుకోవాలి

దేవుని పని చేయు నిమిత్తము మనము తగ్గించుకొనాలి: "మీలో ఎవడైనను గొప్పవాడై యుండగోరిన యెడల వాడు మీకు పరిచారము చేయువాడై యుండవలెను" (మార్కు 10:43, 44). వారిలో ఎవడు గొప్పవాడో యని అపొస్తలులు వాదించుకొను చుండగా యేసు వారికిట్లు బోధించాడు: "మీరు మార్పు నొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్త 18:3).

దేవుని వాగ్దానమిట్లున్నది: "ఇదిగో నేను ముఖ్యమును, పర రచబడినదియు అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించు

చున్నాను; ఆయన యందు విశ్వాసముంచువాడు ఏ మాత్రమును సిగ్గుపడడు" (1 పేతురు 2:6). విశ్వాసముంచువాడు ఎందుకు సిగ్గు పడడు? ఎందుకనగా, క్రైస్తవులు "ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు. ఒకప్పుడు ప్రజగా ఉండక ఇప్పుడు దేవుని ప్రజయైతిరి; ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడిన వారైతిరి" (1 పేతు 2:9, 10). ఇంకా దేవుని వాక్యములో చదువుదాం: "దీనుడైన సహోదరుడు తనకు కలిగిన ఉన్నత దశయందు అతిశయింపవలెను; ధనవంతుడైన సహోదరుడు తనకు కలిగిన దీన దశయందు అతిశయింపవలెను" (యాకో 1:9).

దేవుని వాక్యము విపులముగానే యున్నది. "సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనముగాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1 కొరింధి 1 : 18). రక్షింపబడిన వారెవరు? నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని యేసు చెప్పాడు (మార్కు 16 : 16). విశ్వాసమువలన మన స్వశక్తిగాక దేవుని శక్తిని గూర్చి గ్రహించాలి. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏల యనగా నమ్ము ప్రతివానికి ... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16).

## విశ్వాసము మేరకు విజయము

నీవు గొప్ప విద్యావంతుడవా? అయితే క్రీస్తునందలి విశ్వాసము మేరకు దానిని నీవు వినియోగించగలవు. ఈ లోకము తన జ్ఞానము చేత దేవుని నెరుగలేదు.

నీవు మతశాఖల బోధనశాలలలో తర్ఫీదు పొందావా? అయితే నీవు కొంత సత్యాన్ని తెలిసికొని యుండవచ్చును గాని కొంత అస

త్యాన్ని కూడ నేర్చుకొని యుండ వచ్చును. యేసు సత్యస్వరూపియై యున్నాడు. అసత్యముతో మిళితమైన సత్యము అసత్యమే అవుతాది. నీవు క్రీస్తును సంపాదించుకొను నిమిత్తము సమస్తాన్ని చెత్తగా ఎంచుట ప్రాముఖ్యము.

ఆదివాసులకు, కొండ జాతులకు సువార్త నందించు బోధకులు అనేకులున్నారు; యిది మంచిది. వారికి క్రీస్తునందున్న విశ్వాసము మేరకు వారు ముఖ్యులు. వారి విశ్వాసము గొప్పదైతే క్రీస్తునందు నిజవిశ్వాసములేని గొప్ప కులస్థులు విద్యావేత్తల కంటె క్రీస్తుకొరకు ఎక్కువ చేయుదురు. మనము దేవుని శక్తిని వినియోగించుచున్నామని జ్ఞాపకముంచుకోవాలి.

ప్రతివాడు ఎందువలన ముఖ్యుడో మీకు తెలియజేయగోర్తాను: క్రీస్తు మూలముగా "సర్వశరీరము కీళ్లచేతను నరములచేతను పోషింపబడి అతుకబడినదై దేవునివలన కలుగు వృద్ధితో అభివృద్ధి పొందుచున్నది. ఆ శరీరమే సంఘము (కొలస్స 2 : 19; ఎఫెసీ 1:22, 23). గనుక ప్రతి అవయవము చేయుపనివలన శరీరము యొక్క అభివృద్ధి సాధ్యమగును. మనందరికొరకు చనిపోయిన ప్రభువైన యేసుక్రీస్తును మహిమపరచు సంఘాన్ని భారతదేశములో మనము కలిగియుండాలి. గనుక ఈ వర్తమానమును ప్రతి క్రీస్తు సంఘ సభ్యునికి తెలియజేయండి.

దేవుడు పక్షపాతి కాడు. గనుక నీవు ముఖ్యుడవు !

— జె. సి బెయిలీ

---

"నేనేల క్రీస్తు సంఘ సభ్యుడనైతిని" అనే పుస్తకాన్ని చదివారా! లేకపోతే సత్యవాణికి 2-50 పైసల స్టాంపులు పంపి వెంటనే పొందండి

# పెద్దన్న (The Elder Brother)

లూకా 15:25-32

యేసుప్రభువు చెప్పిన దొరికిన గొఱ్ఱె, దొరికిన నాణెము, తిరిగి వచ్చిన చిన్నకుమారుడు మొదలగు ఉపమానములలో పరలోకములో కలిగిన సంతోషమును గూర్చి విన్నాము. తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానములో పెద్దన్నను గూర్చి ప్రభువేమి మనకు నేర్పుచున్నాడో చూచెదము.

ఇతడు కష్టజీవి—రెండవవాడు యింటికి వచ్చిన దినమున సాయంకాలమువరకు పొలములో పనిచేసినాడని మనము తలంచవచ్చు. కష్టపడకుండా ధనసంపాదన చేయ జూచువారికి యితడు మంచిపాఠము నేర్పుచున్నాడు.

ఇతడు మంచివాడని కూడ చెప్పవచ్చును-తమ్మునిలో మనము చూచు వ్యసనములు, బుద్ధిహీనతలు యితనిలో లేవు. చిన్నవాడు ఆస్తిని పాడుచేయుచుండగా యితడు సమకూర్చుచున్నాడు.

అంతరంగములో దాగియుండి, తమ్ముడు వచ్చిన పిమ్మట బయలుపడిన ఏహ్యలక్షణములు కొన్ని ఈ కథలో మనకు స్పష్టముగా కాన్పించుచున్నవి.

1. క్షమించలేని మనస్సు—"అతడు-కోపపడి లోపలికి పోలేదు (28వ). కోపమెందుకు? పాపాత్ముడు వస్తే వానిని తండ్రి చేర్చుకున్నాడని. నిజమే, ఒకనాడు పాపియే, గాని నేడు హృదయ పరివర్తనపొంది, సన్మార్గ జీవితమునకు సిద్ధమైనాడు; దేవుడు క్షమించినాడు, తండ్రి క్షమించినాడు ఈ పెద్దన్న క్షమించ లేకపోయినాడు. ఆరాత్రి పరలోకములో సంతోషము, భూమిమీద సంతోషము, అందరికిని సంతోషము; ఇతని మనస్సాక్షి కోపముతోను, అసూయతోను, ద్వేషముతోను నిండిపోయినది.

2. కుమారుడై యుండి కూలివాని మనస్సు చూపించినాడు, "ఇన్ని యేండ్లనుండి నిన్ను సేవించుచున్నాను" (29వ). ఇది తండ్రి యిల్లు, తండ్రి, పని కనుక నాయిల్లు, నాపని అని తలంచుట లేదు— "నాకు ఒక మేకపిల్లనైనా యియ్యలేదు" అంటాడు. ఈలాటి పెద్ద న్నలు మన సంఘములో అచ్చటచ్చట యున్నారు— మేము దేవుని సేవచేస్తున్నాము-మమ్ము నెవరు గుర్తించుటలేదు, పదిమందిలో మా పేరెత్తి చెప్పలేదు అంటారు. ఈలాటి వారు మేకపిల్లను కోరిన పెద్దన్న లాటివారే.

3. తండ్రి మాటను తిరస్కరించి తిరగబడుచున్నాడు. "నీ ఆజ్ఞను నేనెన్నడు మీరలేదు" అంటాడు. మీరలేదా? ఆ సమయ మందే అక్కడే తండ్రి మాటను, బ్రతిమాలుటను తిరస్కరించినాడు. లోపలికి రమ్మంటే రానన్నాడు. ఆలాగు తిరస్కరిస్తూ నీ మాట నేనెన్నడు మీరలేదు అంటాడు. స్వనీతి గలవానికి వాని తప్పు వాని కన్పించదు. మారుమనస్సు నొందిన తమ్ముని ద్వేషించుచున్నాడు, ప్రేమగల తండ్రి మాటలు తిరస్కరించుచున్నాడు. నేను మంచివా ననుకొనుట ఒకని నెంత అధోగతికి తీసుకొని వెళ్ళునో ఈ పెద్దన్న కథలో మనము చూస్తున్నాము.

4. "నీ ఆస్తిని వేశ్యలతో తినివేసిన ఈ నీ కుమారుడు" ... ... "వేశ్యలతో" అతడు తిరిగినాడను మాటలు, ఈ పెద్దన్న నోటి నుండియే వింటున్నాము. అతడు చెప్పకపోతే మనకు తెలియదు. అది ఇతని కేలాగు తెలిసినది? చిన్నవాడు - చాలా దూరదేశము పోయి నాడని అన్నచో అంత దూరమునుండి ఈలాటి వార్తలు ఇతని లాగు తెలిసినవి? ఆలాటి ఏర్పాటు ఏమైనా చేసికున్నాడేమో. ఇత లను గూర్చి చెడు మాత్రము విని, మనస్సులో భద్రపరచుకోదలిస్తే ఎంత దూరము నుండి యైనను వినవచ్చు. క్షమాపణ నొందినవా

పాపములు దేవుడు మరచిపోతాడు (హెబ్రీ 8:12; లూకా 7 : 19). గాని స్వనీతిపరులగు పెద్దన్నలు మరువరు.

5. మారుమనస్సు పొందిన వానినిగూర్చి సంతోషించనివాడు సహవాసమును సంబంధమునుకూడ పోగొట్టుకొనును.

ఈ చిన్న కథలో తండ్రి సంబంధ సహవాసములను తిరిగి కట్ట వలెనని, బలపర్చవలెనని ప్రయత్నించినాడు. అందులకే పెద్ద కుమారునితో - "నీ తమ్ముడు, ఈ నీ తమ్ముడు" అని సంబోధించినాడు; గాని అతడైతే సంబంధమును విసర్జించి - "ఈ నీ కుమారుడు" - అని అన్నాడు గాని తమ్ముడు అను మాట నోటి నుండి రానీయలేదు. మనమేలాటి వారమైనను మనలను సహోదరులని పిలుచుటకు మన ప్రభువు సిగ్గుపడలేదు (హెబ్రీ 2:12).

6. ఈ పెద్దన్న పోగొట్టుకొన్నదేమిటి ? మేకపిల్లనిస్తే స్నేహితులతో సంతోషించి యుండునేమో. కాని అతడు సమస్తమును పోగొట్టుకొన్నాడు. "కుమారుడా - నావన్నియు నీవి" (31 వచ) అని తండ్రి బాధతో పలికి యుండును. దేవుని దగ్గర మనకెంత భాగ్యము గలదు. సమస్తము మనదే. "సమస్తము మీవి" అని పౌలు చెప్పుచున్నాడు (1 కొరి 3:22; రోమా 8:32 చూడుము). స్వనీతిపరుడు ఇహపర లోకములలో సమస్తమును పోగొట్టుకొనును.

7. ఈ కథలో తప్పిపోయిన వారెవరు ? తప్పిపోయిన గొర్రె దొరికినది, పడిపోయిన నాణెము దొరికినది. దూరము పోయిన కుమారుడు తిరిగి వచ్చినాడు. దగ్గరేయుండి నేను మంచివాడ ననుకొన్న స్వనీతి పరుడగు పెద్దన్నయే నిజముగా తప్పిపోయినాడు. తరువాత సంగతేమైనది ? అతడు మనస్సు మార్చుకొని లోపలికి పోయి వారితో సంతోషముతో పాల్గొన్నాడా? లేదా తన మొండిపట్టుతో అలాగే

ఉండిపోయినాడా ? మనకు తెలియదు. మనకు నేర్పవలసిన ఈ పాఠము
చెప్పి ప్రభువక్కడొక కథను ముగించినాడు.

8. మరొక ప్రశ్న-ఎవరిని ఉద్దేశించి ప్రభువు ఈ ఉపమానము
చెప్పినాడు ? ఒకటి మనకు స్పష్టముగా పైకి కాన్పించుచున్నది. మా
మనస్సు పొందిన ఎంతటి పాపియైనను ప్రభువు చేర్చుకుంటాడు. కా
ప్రభువు ముఖ్యముగా ఉద్దేశించిన మరొక పాఠమక్కడున్నది.

ఆ సమయమందు ఆయన ఎదుట రెండు రకములైన గుం
లున్నవి. 1. సుంకరులు, పాపులు, వీరు నిష్టగల యూదులచే బహిష్
కింపబడిన వారు. వీరు నిజముగ పాపులే.

2. మరొక ప్రక్క పరిసయ్యులు, శాస్త్రులును. వీరు తమ
దృష్టికి తామే నీతిమంతులమని ఇతరులను తృణీకరించువారు (లూకా
18 : 9). యేసుప్రభు స్పష్టముగ మాట్లాడి యుంటే ఈలాగు చెప్పి
యుండును. సుంకరులు, పాపులు చిన్నకుమారుని లాటివారు, నిజముగ
చెడ్డవారే. మీరు ఈ కథలో చిన్నకుమారుని లాటివారు. మీరు మంచి
వారే, పెద్దన్న లాటివారు. వారు మారుమనస్సు పొందగలరు. మీరు
మారుమనస్సు పొందలేరు ఏలయన మీ స్వనీతి అడ్డు వచ్చుచున్నది

సుంకరులును వేశ్యలును మీ కంటె ముందుగా దేవుని రాజ్యము
లోనికి వెళ్లుదురని మన ప్రభువు మరొక సందర్భమున చెప్పిన మాట
వీరిలాటివారిని చూచియే చెప్పెను (మత్త 21:31, 32).

—టి. జ్ఞానానందం, క్రీస్తుసంఘం, కాకినాడ.

---

మీ సంఘస్థులను, మిత్రులను ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో
చేర్పించండి. క్రీస్తునుగూర్చి, ఆయన సంఘాన్ని గూర్చి ఈ పాఠము
ద్వారా వారికి బోధించండి. వెంటనే ఈ దిగువ చిరునామాకు ఉచి
పాఠముల కొరకు వ్రాయండి :

SATYA VANI, P. O. Box 80, KAKINADA-533 001.

# "ప్రయాణంలో పరివర్తన"

కందాకే రాజ్యమందు
ఖజానా మంత్రి యతడు
భక్తి భావ సంపన్నుడు
భళా! మంచి నపుంసకుడు!

యెరూషలేము దేవాలయ
ఆరాధన కతడు పోయి
తిరిగి వచ్చుచుండె తాను
తిరమెరుగని రీతిగాను!

రథం మీద రహదారిలో
వృధా పోల సమయమంచు
చదువుచుండె సత్యవాక్కు-
స్వామిభక్తి పరాయణుడు!
ప్రభువు దూత ప్రేరణతో
పైనమాయె రథం కడకు
ప్రభువు ఆత్మబలము తోడ
పరుగులెత్తె సువార్తికుడు!

నీవు చదువు భాగమందు
నిగూఢపు సత్యమును
సరిగ నీవు గ్రహించావా?
చెప్పుమనెను యా ఫిలిప్పు!

బోధించువాడు లేక
బోధపడును నాకెట్టుల!
రమ్మ్ము రథం పైకటుంచు
చేర్చుకొనెను సువార్తికుని!

యెషయా ప్రవచనంబు
యేసుక్రీస్తు దైవసుతుడు
క్రీస్తు లేని బ్రతుకు వ్యర్థంబని
వాస్తవమును వివరించెను!

నీళ్ళున్న చోటు రాగా
రథం ఆపి దిగిరి నీట
బాప్తిస్మము పొంది మంత్రి
సంతసమున సాగిపోయె!

సత్యవాక్కు విస్మరించ
చావేగద ఎవరికైన?
యేసుమాట విన్నప్పుడే
ఎదలో నిండు ఆనందము!

క్రీస్తు సూక్తులను దెలిసి
క్రీస్తు సంఘమందు నిలిచి
క్రీస్తు రాకడకు తపించు
క్రైస్తవుడే క్రీస్తువాడు!

అట్టివాని కిచ్చునట్టి
బహుమానము గట్టిదోయి
అవమానము హింసలైన
అధిగమించి సాగవోయి!

— యస్. జే. మేడిది, కొణితివా

# పది ఆజ్ఞలు - ఆత్మ వరములు

"మీరు నన్ను ప్రేమించిన ఎడల నా ఆజ్ఞలు గైకొందురు" అని యేసు చెప్పాడు (యోహాను 14:15). నిర్గమ 20:1-20 లో దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు పది ఆజ్ఞలు ఇచ్చినట్లు మనము గ్రహించుచున్నాము. వాటిలో తొమ్మిదింటిని నెరవేర్చి ఒకటి చేయ లేని యూదుడు శాపగ్రస్తుడే! అందుకే క్రొత్త నిబంధనయందు గలతీ 3:10, 11, 5:4 లో ధర్మశాస్త్రము యూదునకు సంపూర్ణ సిద్ధి కలుగజేయ లేకపోవుచున్నదని అపో॥ పౌలు చెప్పుచున్నాడు.

ఒక్కసారి పరిశుద్ధాత్మ సంఘమునకు ఇచ్చు వరముల విషయం గమనించమనవి.

I కొరింథి 12:8-11 లో కొరింథీ సంఘమునకు ఆత్మ సంబంధమైన వరములు తొమ్మిది వ్రాయుచున్నాడు. ఈ తొమ్మిది వరములు I కొరింథీ 14:26-33 లో వివరించుచున్నాడు. తొమ్మిది వరములు ఒకే ఆత్మమూలముగా ఒకే సంఘములో కలుగుచూ క్రీస్తు శరీర క్షేమాభివృద్ధికి ఆత్మ చేయు పనులుగా వివరించబడెను. అయితే గలతి 5:18-21 లో శరీర క్రియలను గూర్చి వ్రాయుచున్నాడు. అట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యము స్వతంతరించు కొనరని చెప్పుచు, గలతి 5:22-24 లో ఆత్మ ఫలములను గూర్చి వ్రాయుచు అట్టివాటికి విరోధమైన దేదియు లేదని వాటిని చేయుట ద్వారా క్రైస్తవుడు సంపూర్ణ సిద్ధి పొందునని తెలియజేయబడినది.

గలతీ 5:22-23లో మొత్తము తొమ్మిది ఆత్మ ఫలములు కలవు వాటిలో ఏ ఒక్కటి లేకపోయినా క్రైస్తవుడు పరిపూర్ణుడు కాలేడు. ఈ సత్యము మనకు ప్రకటన 2, 3 అధ్యాయములలో సంఘముల కీయబడిన హెచ్చరికల ద్వారా తెలియుచున్నది. లోపైన దానిని చేకూర్చనివాని దీప స్థంభము వానినుండి తీసివేయబడును.

అయితే నేటి మతశాఖలు 1 కొరింథీ 12:8-11నుగూర్చి మాట్లాడ నపుడు మాకు ప్రవచన వరము గలదు, స్వస్థపరుచు వరము మొదలగు తొమ్మిది వరములనుగూర్చి చెప్పుదురు. అయితే వాటి ఉపయోగము నేటి సంఘములయందు ఎంత వరకు అని ప్రశ్నించుచు సంఘాభివృద్ధి ఒక్క భాష మాట్లాడు వరము మాత్రము ఉండినా చాలునా మిగి లిన ఎనిమిది వరములు అవసరము లేదా ? ఒక్క ప్రవచన వరము ఉండినా చాలునా ? లేక ఒక ప్రవచన వరము, ఒక స్వస్థపరుచు వరము ఉండి మిగిలిన ఏడు వరముల అవసరము లేదా ?

అలాగైన యెడల యూదున కియ్యబడిన పది ఆజ్ఞలలో ఒక్క ఆజ్ఞ నెరవేర్చుట చాలును గదా ! మిగిలిన ఎనిమిది వరములు అవస రము గలవారమని చెప్పుకొనువారు ఆలోచించుడి. నీవు ఆ వరము పొందిన నాటినుండి నీ సంఘములో ఎంతమంది రోగులను స్వస్థపరచి తివి ! నీ వెన్ని సార్లు డాక్టరుయొద్దకు వెళ్ళి వైద్యమును పొందలేదు! ప్రవచన వరము గలవారు నీ సంఘములో తాగుబోతులను గూర్చి ఎన్ని సార్లు ప్రవచించితివో ఆలోచించుము. ఆత్మల వివేచన అను వర మును గూర్చి ఎవరూ మాట్లాడుకొనుట లేదు ఎందుచేత ? ఎవరి నిజమైన ఆత్మ లేదు గనుకనా ?

నాడు సంఘము సంపూర్ణముగా ఎదుగుటకు తొమ్మిది ఆత్మ ఇచ్చు వరములు అవసరము. తొమ్మిదింటి యందు ఏ ఒక్కటి లేకపోయినను అది నాటి అపొస్తులుల సంఘం కాదు. ఉట్టి కెగ లేనిది స్వర్గానికెగ దని లోకోక్తిని పోలి యున్నవి మన మాటలు క్రియలు. ఎందుకనగా మత్తయి 25:34-39లో తీర్పు దినమందు రాజు ... నీకు ఎన్ని వరము లున్నవి, ఎంత మందిని స్వస్థపరచితివి, ఎన్నిసార్లు ప్రవచించితివి అని ప్రశ్నించలేదు గాని, 25:34, 39లో క్రైస్తవులను గూర్చి, సాటి సహోదరులకు చేసిన సహాకారములను గూర్చి 40 వ వచనమందు

ఈలాగు చెప్పెను: "మిక్కిలి అల్పులైన ఈనా సహోదరులలో ఒక్కరికి చేసితిరి గనుక నాకు చేసినట్లే అని వారితో చెప్పెను".

మన సంఘములో రోగులు మనతోనేయున్నారు గానీ మనకు స్వస్థత వరములు మెండుగాయున్నవి! మనకు భాషలు మాట్లాడు వరమున్నది గానీ ఆ భాష ఇతరులకే గాదు వారికి కూడా అర్థము కాదు. అమెరికా వారికి తర్జుమాదారులు అవసరమగుచున్నారు గదా!

ఒక్క విషయము నాకు ఆశ్చర్యమగుచున్నది. నేనెరిగిన ఒక సువార్తికునికి బైబిలులో ఒక అక్షరమైనను చదువుట రాదు గానీ అతనికి ప్రవచన వరము, భాషలు మాట్లాడు వరము, స్వస్థపర్చు వరము ఉన్నవి! ఆహా॥ పేతురు పామరుడు విద్యలేనివాడు అయినను పరిశుద్ధాత్మ వలన I, II పేతురు పత్రికలను వ్రాసినాడు.

పౌలు 1 కొరింథీ 13 : 8, 9 వచనములలో ఈలాగు వ్రాయుచున్నాడు: ప్రేమ శాశ్వత కాలముండును ప్రవచనములైనను నిరర్థకములగును. భాషలైనను నిలచిపోవును, జ్ఞానమైనను నిరర్థకమగును. పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణము కానిది నిరర్థకమగును.

యోహాను 8:31లో క్రీస్తు ఈలాగు చెప్పుచున్నాడు: "మీరు నా వాక్యమందు నిలచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు."

—K. G. కుమార్, P. T. స్కూల్, తూరంగి.

---

గమనిక : మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడు మీ సత్యవాక్కు నంబరుతో సహా మీ క్రొత్త అడ్రసు వెంటనే తెలియ జేయండి. ఇది అత్యవసరం !!

# జలప్రళయ హెచ్చరిక

## *(The Warning of the Flood)*

"దేవుడు నోవహునకు ఆజ్ఞాపించిన ప్రకారము పవిత్ర జంతువులలోను అపవిత్ర జంతువులలోను, పక్షులలోను నేలను ప్రాకు వాటన్నిటిలోను మగది ఆడుది జతజతలుగా ఓడలోనున్న నోవహు నొద్దకు చేరెను" (ఆది 7:8, 9). ఈ గొప్ప సంఘటన జరుగకముందే దేవుడు "నేను సృజించిన నరులను నరులతోకూడ జంతువులును ఆకాశపక్షులును భూమిమీద నుండకుండ తుడిచివేయుదును". "భూమిమీద వర్షము కురిపించి నేను చేసిన సమస్త జీవరాసులను తుడిచివేయుదునని" నోవహుద్వారా హెచ్చరించాడు (ఆది 6:7; 7:4). నోవహు నీతిని ప్రకటించాడని పేతురు చెప్పుచున్నందున (2 పేతురు 2:5), అతడు ఓడను నిర్మించుచుండగా దేవుని తీర్పునుగూర్చి ప్రజలకు ప్రకటించాడని మనము తప్పక నమ్మవచ్చును. జల ప్రళయమునకు ముందున్న ప్రజలకు యేమీ హెచ్చరిక యియ్యకుండా వారిని నాశనం చేసియుంటే దేవుడు కఠినుడుగా క్రూరుడుగా పక్షపాతిగా అగుపడును.

నోవహు చేసిన బోధకు లోబడుటకు మానవునికి సరిపడినంత సమయముండెనా? ఆదికాండము 6:3 యేమి చెప్పుచున్నది? "యెహోవా, నా ఆత్మ నరులతో ఎల్లప్పుడును వాదించదు. వారు తమ అక్రమ విషయములో నరమాత్రులై యున్నారు; అయినను వారి దినములు నూట ఇరువది యేండ్లగుననెను". దేవుడు వారికి 120 సంవత్సరముల కాలము నిచ్చాడు. ఇది చాలినంత సమయం. వారికి సరిపడినంత సమయం ఇయ్యలేదని దేవుని ఎవరు నిందించలేరు. అయినను దినములు చెడ్డవి గనుక సమయాన్ని సద్వినియోగం చేసుకోడానికి వారేమీ ప్రయత్నించలేదు. నేడు మనము కూడ వారి వలెనే యున్నాము. సమయం యొక్క అసలైన విలువను మనము గ్రహించక యున్నాము.

"నేను ఆనాడు నివసించియుంటే దేవుడొక జలప్రళయాన్ని పంపుతాడని నమ్మియుండుదును" అని కొందరు చెప్పవచ్చును. అలాగని ఎందుకు చెప్పాలి? అంతకుముందు దేవుడెన్నడు భూమిమీదనున్న పశు పక్ష్యాదులను జంతువులను వృక్షములను నాశనం చేయలేదు, ఇప్పుడెందుకు చేస్తాడు? అని వారాలోచించి యుండవచ్చును. గనుక వారు ప్రకటింపబడుచున్న దేవుని వాక్యాన్ని పెడచెవిని పెట్టారు. నాశనం చేయబడ్డారు. అసంఖ్యాకులైనవారు విశ్వసింపక తమ మీదికి నాశనాన్ని కొని తెచ్చుకొనుచుండగా నోవహు, అతని కుటుంబము విశ్వాసమువలన నడుచుకొంటూ దేవుని వాక్యానికి లోబడ్డారు. జల ప్రళయంనుండి రక్షింపబడ్డారు!

మిత్రుడా, నోవహునాటి ప్రజలను చూడు - వారిదంతా స్వార్థమే. స్వంత ఆనందముకొరకు సొంత కోరికలను నెరవేర్చుకొంటూ దేవుని చిత్తాన్ని విస్మరించారు. మరల, జల ప్రవాహములు వారి మీదికి పొర్లివచ్చి వారిని మ్రింగివేయుచుండగా వారు ఎదుర్కొనిన దేవుని ఉగ్రతను చూడు, మారుమనస్సు పొందడానికి వారికిక సమయంలేదు!

క్రీస్తు మరల వచ్చునప్పుడు అట్టి పరిస్థితియే యుండునని ఆయన చెప్పాడు. "జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసుకొనుచు పెండ్లికిచ్చుచునుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవువరకు ఎరుగక పోయిరి; ఆలాగున నే మనుష్యకుమారుని రాకడ ఉండును" (మత్త 24:37-39). అప్పుడుకూడ ప్రజలు "మాకు ఇంకొంచెము సమయ ముంటే గదా!" యని తలంచుదురు. గాని దేవుడు ముందుగనే హెచ్చరించాడని జ్ఞాపకముంచుకో. దేవుని హెచ్చరికను నిర్లక్ష్యంచేస్తే నాశనమే సుమా!

—రోబర్ట్ M. వాలర్.

## మానవుడు క్రీస్తు రక్తమువలన రక్షించబడునని అది బోధించుచున్నది

*(It Teaches Man is saved by the Blood of Christ)*

### I దైవిక ఏర్పాటులో రక్తముయొక్క తాత్పర్యము

అన్ని యుగాలలోను రక్తము అమోఘమైనది. సంప్రాప్తించే శక్తి గలది. రక్తబలి ఎల్లప్పుడు ప్రాణబలియే, ఏలయనగా "రక్తములో ప్రాణమున్నది" (ద్వితీ 12:23). ప్రతి యుగములోను దేవుడు రక్తబలిని కోరాడు. రక్తముయొక్క పరిహారార్థశక్తిని ఇది వర్ణించుచున్నది. అయినా, మనం ముందుకు చదువుదాం.

1. కాలారంభములో హేబెలు తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని యెహోవాకు అర్పించాడు (ఆదికాండము 4). అది అంగీకరించబడెను. కాని అతని సోదరుడైన కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చాడు. అది అంగీకరించబడలేదు. ఈ మొదటి రక్తబలి లోక పాపములకొరకు క్రీస్తు చిందించిన రక్తమునకు సాదృశ్యముగా యున్నది.

2. దేవుని మిత్రుడు నమ్మకమైన అబ్రాహాము దేవునికి అర్పించే రక్తబలుల ప్రాముఖ్యతను గ్రహించాడు. వాగ్దానము చేయబడిన తన కుమారుడైన ఇస్సాకును ఒక బలిపీఠముపై బలియిమ్మని ఆజ్ఞాపించబడినప్పుడు అతడు వెనుదీయలేదు. కాని తన కుమారుని అర్పించడానికి అతడు కత్తిని ఎత్తగా దేవుని దూత యొకడు అతని ఆపుచేసాడు. అప్పుడు ఇస్సాకు బదులుగా పొదలో కొమ్ములు తగులుకొనియున్న ఒక పొట్టేలు అర్పించబడెను (ఆది 22:1-19).

3. దైవిక ఏర్పాటులో రక్తముయొక్క ప్రాముఖ్యతను పస్కా ఆచరణ మనకు మరింత నిరూపించుచున్నది. ఇశ్రాయేలీయులను విడి

పించుటకు వారి శత్రువులైన ఐగుప్తీయులను నాశనము చేయుటకు యెహోవా బయలువెళ్ళినప్పుడు, ఇశ్రాయేలీయుల యిండ్ల ద్వారబంధపు కమ్ములమీద చల్లబడిన గొర్రెపిల్ల రక్తము వారి రక్షణకు నశింపచేయక భద్రతకు గురుతుగా నుండెను. "నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింపచేయక దాటిపోయెదను. నేను ఐగుప్తు దేశమును పాడుచేయుచుండగా మిమ్ము సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు" అని దేవుడు చెప్పాడు (నిర్గమ 12:13). ఇశ్రాయేలీయులు ఆయనకు లోబడ్డారు. వారిలో ఒక్కడైనను మరణించలేదు. ఈ సారూప్యంలో మనకొక హెచ్చరిక యున్నది. నాశనదూత "అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయు" దినమొకటి రాబోవుచున్నది (2 థెస్స 1:7, 8). గొర్రెపిల్ల రక్తమువలన ఇశ్రాయేలీయులు ఎట్లు రక్షించబడ్డారో, అట్లే క్రీస్తు రక్తమువలన కడుగబడినవారు అంత్యదినమున రక్షింపబడుదురు. గొర్రెపిల్ల రక్తములో తమ వస్త్రములను ఉదుకుకొని వాటిని తెల్లగా చేసికొనినవారి సమూహములో యుండుట ఎంత ఆనందమో!

4. నిబంధనలు రక్తముచే ముద్ర వేయుట దేవుని సంకల్పములో రక్తముయొక్క ప్రాముఖ్యతకు సాక్ష్యముగా యున్నది. మోషే దేవునినుండి పొందిన ఆజ్ఞలను, కట్టడలను అనుసరించి నడువడానికి ఇశ్రాయేలీయులు సమ్మతించారు. రక్తబలులు సమాధాన బలులు దేవుని కర్పింపబడ్డాయి. దేవునికి మానవునికి మధ్య జరిగిన ఈ నిబంధనను ముద్ర వేయడానికి జంతువుల రక్తము ఉపయోగింపబడెను. ఆ సంస్కారముయొక్క వివరణ మనకు నిర్గమ 24:6-8 లో కనబడును. దానినిగూర్చి హెబ్రీ పత్రిక లేఖకుడు హెబ్రీ 9:19, 20లో చెప్పాడు.

5. అట్లే గుడారమును, సేవా పాత్రలను జంతువుల రక్తమువలన శుద్ధిచేయబడి ముద్ర వేయబడెను: "అదే విధముగా గుడారము

మీదను సేవాపాత్రలన్నిటిమీదను ఆ రక్తమును ప్రోక్షించెను మరియు ధర్మశాస్త్ర ప్రకారము సమస్త వస్తువులను రక్తముచేత శుద్ధి చేయబడుననియు, రక్తము చిందింపబడకుండ పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును" (హెబ్రీ 9:21, 22).

6. యూదుల పద్ధతి ప్రకారము జంతుబలులు పలు సంఖ్యలలో అర్పింపబడేవి, కాని అవి పాపమును తీసివేయలేకపోయెను "ధర్మశాస్త్రము రాబోవు మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపముగలది కాదు గనుక ఆ యాజకులు ఏటేట ఎడతెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చువారికి ఎన్నడును సంపూర్ణసిద్ధి కలుగజేయ నేరవు. ఆలాగు చేయగలిగిన యెడల సేవించువారొక్కసారే శుద్ధపరచబడిన తరువాత వారి మనస్సాక్షికి పాపజ్ఞానము ఇకను ఉండదుగనుక వాటిని అర్పించుట మానుదురుగదా. అయితే ఆ బలులు అర్పించుటచేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. ఏలయనగా ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:1-4). ఒక్కటే విధమైన బలులు ఏటేటా అర్పించబడుచూ యుండేవి. కాని ఇశ్రాయేలు బలిపీఠములమీద అర్పించబడిన జంతువుల రక్తమంతా పాపమును తీసివేయలేకపోయెను. అట్లయినప్పుడు దాని ప్రయోజన మేమిటి? అది పాపముల భారమును సంవత్సరానికొకసారి ముందుకు పొడిగించేది. ఆ సమయం అయిపోయేసరికి ఇంకో సంవత్సరం కొరకు అదే బలిని అర్పించవలసి వచ్చింది. మోషే ధర్మశాస్త్ర ప్రకారమున్న పద్ధతి అది. ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము. కాని దేవునికి నమ్మకముగా జంతువుల రక్తమును అర్పించిన యూదులు తమ పాపములను క్రీస్తుయొక్క ప్రశస్త రక్తము వలన సంపూర్తిగా పోగొట్టుకొనగలిగారు.

7. హెబ్రీ 9, 10 అధ్యాయాల్లో జంతువుల రక్తము క్రీస్తు రక్తమును గూర్చిన తారతమ్యము చాల బలముగాను విపులముగాను యున్నది: 1) మొదటి నిబంధన రక్తమువలన ప్రతిష్ఠింపబడెను; మరియు క్రొత్త నిబంధనకూడ అల్లే రక్తము వలన ముద్రవేయబడెను. 2) ఇశ్రాయేలీయులు ఏటేటా అర్పించు బలులవలన తమ పాపభారము ఏటేటా ముందుకు కొనసాగించబడేది, గాని మనమైతే క్రీస్తు రక్తమువలన నిజముగా పాపక్షమాపణ పొందగలము. 3) ప్రధాన యాజకుడొక్కడు మాత్రమే రక్తము చేత పట్టుకొని అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించి, "ఆ రక్తము తన కొరకును ప్రజల అజ్ఞాత కృతములకొరకు" అర్పించేవాడు. అయితే పరిపూర్ణ ప్రధాన యాజకుడైన క్రీస్తు ఆయనకు పాపమేమి లేనందున తన కొరకు గాక, మానవుల పాపములకొరకు జంతువుల రక్తము గాక తన రక్తమునే అర్పించాడు; మరియు ఆ రక్త ప్రభావము వలన దేవునియెదుట మనకొరకు ప్రత్యక్షమగునట్లు పరలోకమునకు ఆరోహణుడయ్యాడు.

8. దీని ముగింపు ఏమంటే, "రక్తము చిందింపబడకుండ పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ 9:22).

## II మానవుని విమోచనకై క్రీస్తు రక్తము చిందింపబడెను

పై శీర్షికలోని మాటలకంటె విపులముగా బోధింపబడిన సంగతి బైబిలులో మరొకటి లేదు. ఈ వాస్తవాన్ని గూర్చి దీనికి ముందున్న భాగములో మనం కొంత చూచాము, అయినను ఈ దీవెనకరమైన తలంపునుగూర్చి చెప్పే అనేక వాక్యములలో కొన్నిటిని చూచుకోవడం మంచిది.

1. క్రీస్తు పొందిన దెబ్బలచేతను గాయములచేతను మనము స్వస్థపరచబడుదుమని యెషయా ముందుగనే చూచాడు: "మన యతిక్రమములనుబట్టి అతడు గాయపరచ బడెను. మన దోషములనుబట్టి

నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను" (యెషయా 53:5, 6).

2. పాపముకొరకు తీయబడిన ఊటను గూర్చి జెకర్యా ప్రవచించాడు: "ఆ దినమున పాపమును అపవిత్రతను పరిహరించుటకై దావీదు సంతతివారి కొరకును యెరూషలేము నివాసులకొరకును ఊట యొకటి తియ్యబడును"(జెకర్యా13:1). ఆ ప్రవచనము నెరవేర్చబడింది. అందువలన నేడు మనం ఈ విధంగా పాడగలుగుచున్నాము :

"ఇమ్మానుయేలు రక్తము ఇంపైన యూటగు
ఓ పాపి యందు మున్గుము పాపంబు పోవును."

3. క్రీస్తు ప్రభురాత్రి భోజనాన్ని స్థాపిస్తూ, "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పాడు (మత్త 26:28).

4. "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను" అనునది సువార్తయొక్క ప్రాథమిక సత్యాలలో ఒకటి (1 కొరింథీ 15:1-4).

5. క్రీస్తు మన కొరకు పొందిన శ్రమలనుగూర్చి రోమా 5:8లో అపొ. పౌలు చెప్పిన మాటలను వినుము: "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి చేయుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను".

6. అన్యజనులు "ఇశ్రాయేలుతో సహపౌరులు కాక పరదేశులును వాగ్దాన నిబంధనలు లేని పరజనులను నిరీక్షణ లేనివారును, లోకమందు దేవుడు లేనివారునై యుండి, క్రీస్తుకు దూరస్థులై యుండగా... ఇప్పుడు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు" (ఎఫెసీ 2:11-13).

7. ప్రతి స్థలములోయున్న ప్రతి జాతికి, ప్రతి తరగతి వారికి, ప్రతి భాష మాట్లాడువారికి, ప్రతి వర్ణానికి క్రీస్తు రక్తము చిందింపబడెను. ప్రతి మనుష్యునికొరకు క్రీస్తు మరణమును రుచిచూచెను (హెబ్రీ 2:9). "నీవు వధింపబడినవాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడు వారిలోను, ప్రతి ప్రజలోను ప్రతి జనములో దేవునికొరకు మనుష్యులను కొని మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి" యని ప్రకటన 5:10లో మనము చదువగలము.

8. క్రీస్తు రక్తమువలన మీరు విమోచింపబడితిరని పేతురు ప్రకటించుచున్నాడు: "పితృ పారంపర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత విమోచింపబడితిరి" (1 పేతురు 1:18, 19).

9. క్రీస్తు రక్తమువలన మనకు విమోచన కలిగినదని పౌలు కూడ చెప్పుచున్నాడు: "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7).

10. యోహాను విమోచింపబడిన జనసమూహమును చూచిన దర్శనములో వారు గొర్రెపిల్ల రక్తములో తమ వస్త్రములు ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొనిరి" (ప్రక 7:14).

బైబిలును గౌరవించు మానవులందరు పాపియైన మానవుడు క్రీస్తు రక్తమువలన రక్షింపబడునని తప్పక అంగీకరిస్తారు. ఇందులో వివాదమేమీ లేదు, కాని క్రీస్తు తన రక్తాన్ని మానవులందరి కొరకు చిందించాడు (హెబ్రీ 2:9), మరియు వారిలో రక్షింపబడువారు కొందరు మాత్రమే గనుక (మత్త 7:13, 14), మన రక్షకుడు చిందించిన రక్తము వలన కలుగు దీవెనలను, పాపక్షమాపణను పొందాలంటే మానవుడు యేసుప్రభువునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలి. బాప్తిస్మములో దేవుడు ఒకని పాపములు క్షమించి పవిత్రపరుస్తాడు.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................................

..............................................

..............................................

..............................................